కథా నిలయం
55739
శ్రీకాకుళం

# ది రైటర్

ఆంధ్రజ్యోతి వీక్లీ. 21 ఏప్రిల్, 2000




‘అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని’ అన్నట్లు– ఈశ్వర్‌కి ఎంత తెలివి ఉన్నా అదృష్టం సున్నా!

తన తెలివి తనకు ఉపయోగపడదని అతనికి చిన్నప్పట్నించే అనుభవమైంది. చిన్నతనంలో అతని గైడెన్స్‌లో ఫస్టుమార్కులు సంపాదించేవారు స్నేహితులు. చివరికి ఈశ్వర్ మాత్రం ఒకటో,రెండో మార్కులే తక్కువలో ఉండేవాడు. ఈ వింతేమిటో అతనికే కాదు– వాళ్ళకీ అర్థమయ్యేది కాదు.

అతని దస్తూరి కుదురుగా ఉండదనో, పేపరు దిద్దేటప్పుడు మాస్టారి మూడ్ బాగావుండి ఉండదనో, తమకు బాగా తిరిగి చెప్పగలిగినా స్వయంగా రాసేటప్పుడు ఏదైనా మర్చిపోయేవాడో

అనుకునేవారు. కాని, ఇలాంటి అనుభవాలు కొన్ని ఎదురయ్యాక- ఇంతకీ కారణం తన దురదృష్టమే ననుకొని బాధపడేవాడు ఈశ్వర్. ఎంత కృషి చేసినా నిరుత్సాహమే చవిచూడవలసి రావటంతో అంతులేని నిరాశకు లోనయ్యేవాడు.

చదువుకునే రోజుల నుండి ఈశ్వర్ సరదాగా కాలేజి మ్యాగజైన్‌కి చిన్నచిన్న కథలు, కవితలు రాస్తుండేవాడు. అవి చదివి అందరూ మెచ్చుకునేవారు. ఆపకుండా రాస్తూ ఉండమని ప్రోత్సహిస్తుండేవారు.

ఈశ్వర్ చిన్నఉద్యోగంలో చేరాడు. అతనిలో రచనాసక్తి తగ్గలేదు. అప్పుడప్పుడు తన మనసులోని భావాలకు అక్షరరూపం ఇస్తుండేవాడు. అయితే ఇక్కడా ఈశ్వర్‌ని దురదృష్టం వరించటం ప్రారంభించింది. ఎంత మంచి ఇతివృత్తం ఎంచుకొని, ఎంత చక్కగా ప్రెజెంట్ చేసినా... అతని రచనలు జెట్‌స్పీడులో తిరిగి వచ్చెయ్యటం మొదలైంది. పత్రికలో కథలు ప్రచురింపబడటమంటే కాలేజి మ్యాగజైన్‌లో పడినంత తేలిక కాదని తెలుసుకున్నాడు. తప్పిదారి ఏ చిన్నకవితో- కథో ఏ పత్రికలోనైనా ప్రచురణకు నోచుకుంటే ఈశ్వర్ సంబరం అంబరాన్ని అంటేది. అవి చదివి మిత్రులు ప్రశంసిస్తుంటే పొంగిపోయేవాడు. కాని, అటువంటి అవకాశాలు చాలా అరుదుగా ఉండేవి. ప్రతి రంగంలోనూ తనకంటే ఒక అడుగు ముందుండే దురదృష్ట దేవతను తలుచుకుని ఈశ్వర్ కృంగిపోయేవాడు.

సరిగ్గా ఈ సమయంలో అతని చిన్ననాటి మిత్రుడు సుందర్ కలిశాడు. అతనేదో పెద్దకంపెనీలో ఇంజనీర్‌గా మంచిపొజిషన్‌లో ఉన్నాడు. అతను కూడా సాహితీప్రియుడు. మార్కెట్లోకి వచ్చిన ప్రతి పత్రికా కొనిచదవటం అతని హాబీ.

"నీది మంచిహ్యాండ్! సబ్జెక్టు చక్కగా ప్రెజెంట్ చేస్తావు. ఈరోజుల్లో వస్తున్న కథలకంటే నీవి డిఫరెంట్‌గా వుండి ఆలోచింపచేస్తాయి. బాగా రాసి మంచి పాపులారిటీ సంపాదించు. నీ టేలెంట్ నాకు ఉంటేనా..." అన్నాడు సుందర్.

ఈశ్వర్ నీరసంగా నవ్వి, ఒకే షాట్‌లో తిరిగివచ్చిన తన రచనల్ని చూపి, "లాభం లేదు గురూ! గుర్తింపు రావాలన్నా అదృష్టం ఉండాలి. ప్రతిభ ఉంటే చాలదు. అసలే నోటికీ, చేతికీ పొంతన కుదరక సతమతమవుతున్నాను. మానసిక ఒత్తిడి, బ్రైన్ వర్క్, ఫిజికల్ స్ట్రెయిన్ అటుంచి, ఒక కథ పంపాలంటే కనీసం ఇరవై రూపాయలన్నా ఖర్చవుతుంది. ఒకటీ, అరా పడినా వందా, యాభై తప్ప రెమ్యునరేషన్ రాదు. ఒక్కోసారి అదీ వస్తుందన్న నమ్మకం లేదు. కాంప్లిమెంటరీ కాపీ కూడా మనకు అందదు. కథ ప్రచురించారన్న విషయం ఎవరి ద్వారానో విని మ్యాగజైన్ కొనుక్కోవాలి" అంటూ తన గోడు వెల్లడించుకున్నాడు.

రచనలు చదివి ఆనందించటం తప్ప, రచయితల కష్టసుఖాలు అంతగా తెలియని సుందర్- ఈశ్వర్ బాధ పట్టించుకోలేదు. అతని కథలన్నీ చదివి ఒక కథ ఎంచుకున్నాడు.

"ఈశ్వర్... ఏమీ అనుకోకపోతే ఈ కథ నా పేరుతో పంపకూడదూ! లెటజ్ ట్రై మై లక్..!"

ఈశ్వర్‌కి అదేం పెద్ద బాధాకరమైన విషయంగా అనిపించలేదు. రచయితగా నిలబడగలనన్న నమ్మకం తగ్గిపోయింది. రాయాలన్న ఉత్సాహం కూడా సన్నగిల్లింది. వెంటనే కథను సుందర్ పేరుతో పంపాడు.

రెండునెలలు గడిచాక ఒకరోజు సుందర్ ఆనందంతో తబ్బిబ్బైపోతూ ఈశ్వర్ దగ్గరికి వచ్చి, తన కథ పడిన మ్యాగజైన్ చూపాడు.

ఈశ్వర్ నిర్ఘాంతపోయాడు. చక్కని కలర్ స్కెచ్‌తో ప్రముఖ వారపత్రికలో రెండు ఫుల్‌పేజీలలో కథ ప్రింటైె వుంది. కథపైన పెద్దపెద్ద అక్షరాలతో సుందర్ పేరు కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఇక సుందర్ ఆశ్చర్యానందాలకు అంతులేదు. కథ అక్షరం- అక్షరం మళ్లీ మళ్లీ చదివి, "ఈ క్రెడిట్ నీదే బ్రదర్!" అని ఈశ్వర్‌ని ఆకాశానికెత్తేశాడు. ఈశ్వర్ కూడా సుందర్ ఉత్సాహం చూసి, 'పోనీలే... సుందర్ కూడా రచయితల లిస్టులోకి ఎక్కాడు' అని తృప్తి చెందాడు.

ఓవర్ నైట్‌లో అకస్మాత్తుగా సుందర్ రైటరైపోయాడు. అతని సర్కిల్ పెద్దది. ఒరిజనల్‌గానే కొంత పాపులారిటీ ఉన్న వ్యక్తి కావటంతో సుందర్ మొదటి కథతోనే చెయ్యితిరిగిన రచయితగా గుర్తింపు పొందగలిగాడు.

ఈ మొదటి కథ ప్రచురితమైన ఉత్తేజం నుండి బయటపడ్డాక- సుందర్ మళ్లీ ఒకసారి ఈశ్వర్‌ని కలిశాడు.

"ఈశ్వర్! నీ వలన నాకు రైటర్‌గా పేరు వచ్చింది. 'ఈమధ్య ఏం రాస్తున్నారు..?' అంటూ ఫ్రెండ్స్ అడుగుతున్నారు. మళ్లీ ఏమన్నా ప్రయత్నం చేద్దామా..?"

తన పరిస్థితిలో మార్పేమీ లేకపోవటంతో ఈశ్వర్ కాదనలేకపోయాడు. మళ్లీ ఇంకొక కథ... ఇంకొక కథ... ఇంకొకటి... చిత్రమేమంటే- ఈశ్వర్ కథలన్నీ ఒక్కటి కూడా తిరిగిరావటం లేదు. అన్నీ సుందర్ పేరుతో ప్రముఖ పత్రిక లన్నింటిలోనూ ప్రచురితమవుతున్నాయి.

సుందర్ త్వరలోనే పత్రికల 'పల్స్' తెలుసుకున్నాడు. 'టెక్నిక్' అర్థంచేసుకున్నాడు. తనకు కావాల్సిన లైన్ చెప్పి ఈశ్వర్ చేత కథ రాయించేవాడు. క్రమంగా సుందర్ అగ్రశ్రేణి రచయితగా గుర్తింపు పొందాడు.

ఈ జీవితంలో తన తెలివి తనకు ఉపయోగపడదన్న సత్యాన్ని పూర్తిగా నమ్మాడు ఈశ్వర్. సుందర్ కోసం రాత్రింబవళ్ళు శ్రమిస్తున్నాడు. క్రమంగా ఈశ్వర్ పేరుతో అప్పుడప్పుడు అయ్యే ప్రచురణలు కూడా ఆగిపోయాయి.

సుందర్ నవలకు 'సాహిత్య అకాడమీ' అవార్డు వచ్చింది.

సుందర్ నిజంగా గొప్ప అదృష్టవంతుడని ధృవపరచుకున్నాడు ఈశ్వర్.

సుందర్ పట్టుపట్టి అవార్డు తీసుకోవడానికి ఈశ్వర్‌ని కూడా వెంట తీసుకెళ్లాడు. సుందర్ మనసునిండా ఈశ్వర్ పట్ల ప్రేమ, కృతజ్ఞత పెరిగిపోయాయి. తననింతటి వ్యక్తిగా సమాజం ముందు నిలబెట్టింది ఈశ్వరేనన్న సత్యం అతనెప్పుడూ మరవలేదు.

"ప్రతి పురుషుడి ఉన్నతి వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు. కానీ, నేను రచయితగా ఇంత ఎదగడానికి కారణం నా మిత్రుడు ఈశ్వర్. అతని ప్రోత్సాహం, సహకారం లేకపోతే నేడు నేనీ స్థాయికి ఎదిగేవాడిని కాను!"

ఈశ్వర్ మనసంతా దిగులుగా వుంది. తనకు అందవలసిన సన్మానం, గౌరవం సుందర్ అందుకుంటున్నందుకు కాదు. ఆ అదృష్టం తన జాతకంలో లేనందుకు..!

సన్మానం అందుకొంటున్న సుందర్‌లో ఈశ్వర్ తన్ను తానే చూసుకుంటున్నాడు.